కథానిక



● యండమూరి వీరేంద్రనాథ్
● చిత్రాలు : నర్సిం

కొత్తగా కొన్న ఫియట్ కారుని తీసుకుని బయలుదేరాను. నేను వెళ్తున్నది శశాంక ఇంటికి. నేను కారు కొని రెండు రోజులయింది. అతని ఇంటికి ప్రత్యేకంగా వెళ్ళటానికి కారణం నేను కారు కొన్నానన్న విషయం అతనికి తెలియాలని!

అందుకనే నా మిత్రులనీ, ఎడిటర్‌లనీ, నా శ్రేయోభిలాషులందరినీ వదిలేసి మొట్టమొదటిసారి అతని దగ్గరికి బయలుదేరాను. ఎందుకంటే, అతను నా ప్రథమ శత్రువు కాబట్టి! మేమిద్దరం బాగా మాట్లాడుకుంటాం. సాహితీ సభలో బాగా ఉపన్యాసాలిస్తాం. అతను నన్ను పొగుడుతాడూ.....నేనతన్ని పొగుడుతాను. కానీ, మనసులో మాత్రం నేనతన్ని ద్వేషిస్తాను. అతను కూడా నన్ను ద్వేషిస్తున్నాడో లేదో నాకు తెలీదు. ఎందుకంటే అతనెప్పుడూ బయట పడలేదు. .....నాలాగే!

అలా అని మేమిద్దరం రచనా వ్యాసంగాన్ని ఒకేసారి ప్రారంభించలేదు. మేమిద్దరం ఒకే వయసు ఉన్నవాళ్ళం కూడా కాదు. అతను నా కన్నా చిన్నవాడు. నాకో చిన్న తమ్ముడుంటే అతనంత వయసుండేది.

నేను మొట్టమొదట్లో డిటెక్టివ్ కథలూ, జోకులూ, చందమామ కథలూ రాసేవాడిని. తరువాత నవలా రంగంలోకి వచ్చాను. నేను వచ్చినప్పుడు తెలుగు సాహిత్యంలో పాపులర్ రైటర్స్ అనేవాళ్ళెవరూ లేరు. నేనే నంబర్ వన్. ఒకరిద్దరు రచయిత్రులున్నా కూడా మగవాళ్ళలో నన్ను బీట్ చేసే వాళ్ళెవరూ లేరు.

అలా పది సంవత్సరాలు నేను రాజ్యమేలాను - సాహితీ రంగంలోకి శశాంక ప్రవేశించేంతవరకూ.

''నమస్తే సర్......నా పేరు శశాంక.'' సమ్రతగా చేతులు జోడిస్తూ అన్నాడతను. పది సంవత్సరాల క్రితం జరిగిన ఆ సంఘటన నా కింకా కళ్ళకి కట్టినట్టే ఉంది.

''కూర్చోండి.'' కుర్చీ చూపిస్తూ, అతని వంక పరిశీలనగా చూశాను. ఆ ముఖంలో నన్నాకర్షించిన అంశం ఒకే ఒక్కటి....అతని కళ్ళలోని నైర్మల్యం!

అతను కూర్చున్నాక, ''చెప్పండి'' అన్నాను.

''నేను మీ సమయాన్ని కొద్దిసేపు వినియోగించుకో వచ్చా?'' స్వచ్ఛమైన ఇంగ్లీష్‌లో అడిగాడు.

''విత్ ప్లెజర్!'' చిరునవ్వుతో నిర్లక్ష్యంగా అనేసి, రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి సిగరెట్ ముట్టించాను.

అతనో క్షణం నా వంక మొహమాటంగా చూసి, తన చేతిలోని ఫైలొకటి అందించాడు. తరవాత అన్నాడు: ''నేనొక నవల రాశాను. నా అభిమాన రచయిత అయిన మీరు దయచేసి ఈ స్క్రిప్ట్ చదివి మీ అభిప్రాయాన్ని చెబుతారనే ఆశతో వచ్చాను.''

సిగరెట్ యాష్‌ట్రేలో నలిపేసి, మనసులో వినుగును పైకి కనబడనీయకుండా ముందుకు వంగి ఫైల్‌నందుకున్నాను.

''సబ్జెక్ట్ ఏమిటి?''

అతడు కొద్దిగా సిగ్గు పడుతున్నట్టు నవ్వి ''యూనివర్సల్ సబ్జెక్ట్. ప్రేమ సర్'' అన్నాడు.

''ఇంకా ప్రేమ గురించి రాయటానికంటూ ఏం మిగిలిందయ్యా! ఉన్నదంతా మేమూ, మా సీనియర్సూ రాయడానికే సరిపోయింది'' అన్నాను.

''క్షమించాలి సర్! నా దృష్టిలో ప్రేమ అనేది ఎలా అజరామరమైందో, ఆ సబ్జెక్ట్ కూడా అంతేనని! దటీజ్ ఎవర్ గ్రీన్ సబ్జెక్ట్. ఒక మనిషి మరో మనిషితో ప్రేమించానని చెప్పడం ఎంతో సులభం. కానీ, ఆ ప్రేమలో తను పొందిన అనుభూతిని మాత్రం వర్ణించడం కష్టం. అనుభవాన్ని పంచుకోవటం సాధ్యమే కావచ్చు. కానీ, అనుభూతిని మాత్రం మరొకరికి తెలియజేయడం అసాధ్యం. నేను ఎంచుకున్నది రెండో విషయం. కేవలం ఫీలింగ్సే మెయిన్‌గా చిత్రించిన నవల ఇది. నా ఉద్దేశం ప్రకారం ప్రతి పాఠకుడూ ఎక్కడో ఓ చోట తనని తను రియలైజ్ చేసుకుంటాడనే అనుకుంటున్నాను...'' చాలా నెమ్మదిగా, స్పష్టంగా చెప్పాడు. ఆ చెప్పడంలో కాస్త ఆత్మవిశ్వాసం కూడా తొంగి చూసింది.

అతను మాట్లాడే పద్ధతి బావుంది. అయితే, ఒక రచయిత మరో రచయితని కలుసుకున్నప్పుడు అక్కడ లేని మూడో రచయిత గురించి హేళనగా మాట్లాడుకునే మా ఫీల్డులో ఇంత సున్నితత్వం అసలు పనికి రాదు.

''సరే. అయితే, నేనిప్పుడు కాస్త బిజీగా ఉన్నాను. స్క్రిప్ట్ ఇచ్చి వెళ్ళు ఎల్లుండి మళ్ళీ వస్తే ఆపాటికి చదివేసి చెప్తానెలా ఉందో.'' సాధ్యమైనంత మెత్తగా చెప్పాను.

అతను మరోసారి నమస్కరించి వెళ్ళిపోయాడు. అతనటు వెళ్ళటం ఆలస్యం, విసురుగా దాన్ని టేబుల్ మీద గిరాటేసి, ఎవరో అభిమానంతో రాసిన ఉత్తరాన్ని అందుకున్నాను. అతను మళ్ళీ వస్తే ఆలోగా ఏదో ఒక వాక్యం చదివి గుర్తుంచుకుని దాని గురించి చెప్తూ, బాగాలేదంటే సరిపోతుంది అనుకున్నాను.

> ఒక్కోచోట అతని భావాలు కీట్స్ పొయెట్రీని మించి పోయాయి. ఫీలింగ్స్ ప్రధానంగా ఇంతవరకూ ఎవరూ ఇంత బాగా రాయలే దనిపించింది.

కానీ, ఆ రాత్రే నేను స్క్రిప్టంతా చదవాల్సి వచ్చింది.

అందుకు కారణం నా భార్య సౌదామిని!

సాయంత్రం ఆరవుతూండగా సౌదామిని నా గదిలోకి అడుగుపెట్టి అడిగింది: ''కాఫీ ఏమయినా కావాలా?''

నేను తలెత్తి, ''ఊఁ. నువ్వు కలుపుతూండు, నేనొస్తున్నాను'' అన్నాను.

''అలాగే'' అంటూ వెనుదిరిగింది. వెళ్ళబోతూ ఆగి, కిందికి వంగి దేన్నో తీస్తూ, ''ఇదేమిటి ఇక్కడ?'' అంది.

''ఏంటీ?''

''ఏమో, ఏదో పేజీ పడిందిక్కడ'' అంటూ అందివ్వబోయి, ఆగి ఆ కాగితంలోని వాక్యాలని చదివింది. చదవటం పూర్తి కాగానే తలెత్తి ''ఎవరు రాశారండీ ఇది?'' ఉత్సుకతగా అడిగింది.

''ఏదీ ఇటివ్వు.'' తీసుకొని చూశాను. శశాంక స్క్రిప్ట్‌లోని పేజీ అది. అదే చెప్పాను.

''నేను చదవొచ్చా?''

''తీసికెళ్ళు'' అంటూ ఫైలందించాను. ఎలాగూ నేను చదవను కాబట్టి ఆమె చదివాక క్లుప్తంగా తెలుసుకోవచ్చు అనుకున్నాను. సౌదామిని ఆ స్క్రిప్ట్ తీసుకుని వెళ్ళిపోయిన



పది నిమిషాల తరవాత నేను కూడా లేచి హాల్లోకి వచ్చాను. సౌదామిని హాల్లో లేదు. బెడ్‌రూమ్‌లో దీక్షగా చదువుతూ ఉంది.

ఆ రాత్రి భోజనం చేస్తూండగా అంది సౌదామిని: "అతనెవరో కానీ మనసు లోతుల్లోకి చొచ్చుకుపోయేలా రాశాడు. ఆ స్క్రిప్ట్ చదువుతూంటే నాకెంత ఆశ్చర్యం కలిగిందంటే, ఇరవై ఏళ్ళ నుంచీ ఫీల్డ్‌లో ఉన్న మీరు అలాంటి ఒక్క నవల కూడా ఎందుకు రాయలేదా అనిపించింది."

"అంతగా నచ్చిందా?" మామూలుగా అన్నాను. నిజానికి సౌదామిని సగటు పాఠకురాలు కాదు. ఆమె స్క్రిప్ట్ చదివి చెప్పిన అభిప్రాయం మీదే ఇంతకాలం నా సక్సెస్ ఆధారపడిందీ అంటే అతిశయోక్తి కాదు.

ఆమె మౌనంగా ఉండటం చూసి నా ప్రశ్న మళ్ళీ రెట్టించాను.

"అవును. ఇదే అతని మొదటి నవలయితే పబ్లిష్ అవటం ఆలస్యం, మీలాంటి ఒక్కరిద్దరు తప్ప మిగతా రచయితలంతా అస్త్ర సన్యాసం చేయాల్సిందే" అంది.

నా భార్య నా ముందే వేరే రచయితని పొగుడుతూంటే అసూయగా అనిపించింది. అంతగా ఆమెని ఆకర్షించిన అంశం అందులో ఏముందసలు? పడుకునే ముందు కాసేపు తిరగేయాలనుకున్నాను.

కానీ, భోజనం అయ్యాక అతని స్క్రిప్ట్ చేతిలోకి తీసుకున్న నేను అక్షరమక్షరమూ విడవకుండా చదివాను. ఒక్కచోట అతని భావాలు కీట్స్ పొయెట్రీని మించిపోయాయి. ఫీలింగ్స్ ప్రధానంగా ఇంతవరకూ ఎవరూ ఇంత బాగా రాయలేదనిపించింది.

ఆ రాత్రి నేను నిద్రపోలేదు.

ఆ తరువాత శశాంక రాసిన ఆ నవల ఒక ప్రముఖ వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. అది అతన్ని పాఠకులంతా గుర్తించేలా చేసింది.

ఇక శశాంకకి తిరుగు లేదు... అతను నిలదొక్కుకున్నాడూ- అంటే అది నేను భరించలేను. నా స్థానాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేను.

తరువాత నేనో నవల రాశాను. ఆ నవలలో ముందుమాట వ్రాస్తూ 'నేను ఫలానా ఇంగ్లీషు నవలని తెలుగులో రాద్దామనుకున్నాను. కానీ, ఆ నవలని నా మిత్రుడైన ఒక రచయిత పూర్తిగా యథాతథంగా కాపీ కొట్టి రాసేయటం వల్ల నేను ఆ ఆలోచనని ఉపసంహరించుకున్నాను' అని రాస్తూ, శశాంక నవల కథాంశాన్ని క్లుప్తంగా ముందుమాటలో రాశాను.

ఇలా రాయటం వల్ల నేను నా ప్రత్యర్థి రచయిత అయిన శశాంక ఇంగ్లీష్ నవలలు కాపీ కొట్టి రాస్తాడు అన్న భావాన్ని పాఠకుల్లోకి ఇన్‌డైరెక్ట్‌గా ఇంజెక్ట్ చేయగలిగాను.

ఇది జరిగిన మూడు నెలలకి శశాంక రాసిన ఒక అద్భుతమైన నవల తెలుగు సాహిత్యంలోకి వచ్చింది. పల్లె సీమలూ... కోనసీమ కొబ్బరాకులూ నేపథ్యంగా - "తాను ఏవో ఇంగ్లీష్ నవలలు కాపీ కొడతాడు" అని అభియోగం వేయలేని విధంగా వేదాల్నీ ఉపనిషత్తుల్నీ రంగరించి వదిలాడు. దానితో సాహితీపరుల దృష్టిలో శశాంక విపరీతంగా ఎదిగిపోయాడు.

**ఎవరూ ఊహించని విధంగా నా నవలకి జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించబడింది. శశాంకని అధిగమించే గెలుపు. నేనిప్పుడు నంబర్ వన్ రైటర్ని.**

నిజానికి నేను చాలా ఇంగ్లీష్ నవలలు చదువుతాను. వాటిల్లోంచి కొన్ని ఇన్సిడెంట్స్ ఏరి మొత్తమంతా కాక్‌టెయిల్‌లా తయారు చేసి మార్కెట్‌లోకి వదులుతూంటాను. నేను రాసే రొమాన్స్ అంతా ఇంగ్లీష్ పుస్తకాల్లోది. కామెడీ ఉడ్‌హౌస్‌ది.

అయితే, నేను చేస్తున్న పనిని నా ప్రత్యర్థి మీద రుద్దాలని చేసిన ఆ ప్రయత్నం ఫెయిలై - అతనిలోని అసలైన రచయిత బయటికి రావడానికి కారణమయింది. సాహిత్యంపై పూర్తి అవగాహన ఉన్న పాఠకులందరిలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు శశాంక.

అతన్ని మానసికంగా బ్రేక్ చేయగలిగే ఏ అవకాశమూ నాకిక లేదు అనుకుంటున్న తరుణంలో ఓ రోజు --

ఒక డైరెక్టర్ నా దగ్గరికి వచ్చి, నా కథని సినిమాగా తీస్తానన్నాడు. ఆ డైరెక్టర్ తెలుగులో మంచి పేరున్నవాడు. నాకు చాలా ఆనందం కలిగింది. నా సంతోషానికి కారణం మొదటిసారిగా నా కథ సినిమాగా వస్తున్నందుకు కాదు. శశాంకకు రాని అవకాశం నాకు వచ్చినందుకు.

వెంటనే ఈ విషయం అతనికి చెప్పడానికి బయలుదేరాను.



నేను వెళ్ళేసరికి అతని ఇంటి ముందు మారుతి థౌజెండ్ సి.సి కారొకటి ఆగి ఉంది. ఎవరయి ఉంటారా అనుకుంటూ లోపలికి అడుగు పెట్టాను.

బయట శశాంక అసిస్టెంట్ అనుకుంటాను, కూర్చుని ఏదో రాసుకుంటోంది. నన్ను చూడగానే ఆమె కళ్ళలో గుర్తింపు.

హడావిడిగా లేచి, "సర్‌తో మీరొచ్చారని చెప్పమంటారా?" అనడిగింది.

"అవసరం లేదు. లోపలెవరున్నారు?" చనువుగా డోర్ దగ్గరికి వెళ్ళబోతూ అడిగానామెని. "డైరెక్టర్ సోమసుందరన్‌తో స్టోరీ డిస్కషన్స్‌లో ఉన్నారు."

హఠాత్తుగా ఆగిపోయాను. ఆమె ఏమందో నాకర్థం కాలేదు. సోమసుందరన్ ఏమిటి? శశాంకతో డిస్కషన్స్‌కి కూర్చోవడమేమిటి?

"ఏమిటి?" తిరిగి రెట్టించాను. "అవును, సర్. సోమసుందరన్‌గారు తెలుసనుకుంటాను. ఆయన శశాంకగారి కథని సినిమా తీయాలనుకుంటున్నారు" అంది.

నేనిక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేకపోయాను.

వేగంగా బయటికి నడిచాను. సోమసుందరన్ అంటే మామూలు దర్శకుడు కాదు. ఒకే సినిమాని ఎనిమిది భాషల్లో తీసి హిట్ చేసి రికార్డుల్లోకి ఎక్కినవాడు.

అలాంటివాడి ముందు నా కథని సినిమా తీయాలనుకున్న డైరెక్టర్ పూచికపుల్లకి కూడా కొరగాడని అర్థమయిపోయింది.

ఇక ఆ విషయం శశాంకకి చెప్పలేక వెనుదిరిగాను.

* * *

పది సంవత్సరాలు గడిచాయి.

అంతవరకూ సాహితీ రంగంలో శశాంకని బీట్ చేసే రచయిత ఎవరూ రాలేదు. నేను నంబర్ టూగానే ఉంటూ వచ్చాను. సాధ్యమైనంతవరకూ అవకాశం దొరికినప్పుడల్లా శశాంకపై బురద జల్లడానికే ప్రయత్నించేవాడిని.

తరువాత నా స్టాండర్డ్ కారు అమ్మేసి ఫియట్ కారు ఒకటి కొన్నాను. అది అతనికి చూపించాలని నా తాపత్రయం. అది కొన్న మరునాడే శశాంక దగ్గరికి బయలుదేరాను. ఇప్పుడు ప్రస్తుతం నా ప్రయాణం అక్కడికే.

అతని కొత్త ఇల్లు అద్భుతంగా ఉంది. బ్రహ్మాండమైన మొజాయిక్ ఫ్లోర్, వాల్ టూ వాల్ కార్పెట్, ఖరీదయిన ఫర్నిచర్... అదంతా చూశాక నేను పూర్తిగా కుదించుకుపోయాను.

అక్కడి నుంచి వచ్చాక మొట్టమొదటిసారిగా నన్ను నేను ఆత్మపరిశీలన చేసుకున్నాను. అతని అభివృద్ధికి మూలం ఏమిటని శోధించాను. అప్పుడర్థమయింది నాకు. నేను ముందుగా చేయవలసిన పని నా ప్రత్యర్థి స్థానాన్ని దిగజార్చడం కాదు, అతని స్థానాన్ని అధిగమించడం.

నెలకొక నవల ఈజీగా రాసే నేను ఈసారి ఒక మంచి నవల మొదలుపెట్టాను. అది రాయడానికి నాకు దాదాపు సంవత్సరం పట్టింది. అది రాసేటప్పుడు రాత్రీ, పగలూ, తిండీ, నిద్రా ఏదీ గుర్తు లేదు నాకు. నా ధ్యేయం ఒక్కటే. దిగజారిపోయిన 'నా స్థానాన్ని' తిరిగి సంపాదించటమే కాదు, సుస్థిరపరచుకోవాలని.

అన్నిటికన్నా ముఖ్య ఉద్దేశం శశాంకని తెర మరుగుకు వెళ్ళేలా చేయాలని. అన్ని రకాల మసాలాలూ గుప్పించాను. సస్పెన్సు, శృంగారం అన్నీ చొప్పించాను.

కానీ, ఆ నవల నేను ఆశించినంత సక్సెస్‌ని తెచ్చిపెట్టలేదు. ఆర్థికంగా కూడా దానివల్ల నాకెటువంటి లాభమూ కలగలేదు. నా స్థానంలో ఎలాంటి మార్పూ లేదు. నా నవల 'ఫెయిల్' అవటానికి కారణం తెలిసింది. అందులో 'మనసు' లేదు.

నేను ఊహించిన విధంగా నా నవల శశాంక స్థానాన్ని అధిగమించడానికి ఏమాత్రం ఉపయోగపడకపోయేసరికి నాకేం చేయాలో తోచలేదు. ఆ నవల మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. కనీసం కమర్షియల్‌గా హిట్ కాకపోయినా, నేను బాధ పడేవాడిని కాదు. మేధావుల్లో పేరు కూడా రాలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొని ఏం లాభం?

ఇక తిన్నగా ప్రయత్నించి లాభంలేదనిపించింది. నాకున్న పలుకుబడి అంతా ఉపయోగించి ఆ నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు కొనుక్కున్నాను. అందుకు నాకు పాతికవేలకి పైగానే ఖర్చయింది.



అయినా, నేనేమీ బాధపడలేదు. ఖర్చుకన్నా ముఖ్యం అతన్ని అధిగమించడం. అవార్డు ప్రకటించిన తరువాత నాకు బాగా దగ్గరైన ఇద్దరు ఎడిటర్లని పిలిచాను. పబ్లిషర్స్ కూడా వచ్చారు. పెద్ద పార్టీ జరిగింది. వాళ్ళు వెళ్ళే ముందు అసలు విషయం చెప్పాను. నాకు అవార్డు వచ్చిన సందర్భంగా ఒక సన్మాన సభ ఏర్పాటు చేయమంటూ. అందుకు ఖర్చు కూడా నేనే భరిస్తానని చెప్పాను. వాళ్ళు సరేనన్నారు. ఈ అభినందన విషయం పేపర్లలో విపరీతమైన ప్రకటనలు గుప్పించాను. ముఖ్య అతిథిగా నా ప్రత్యర్థి శశాంకని పిలవమన్నాను. అంతా అనుకున్నట్టే జరిగింది. నా శ్రేయోభిలాషులు నాకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. శశాంకను ముఖ్య అతిథిగా పిలిచారు. థ్రిల్ ఫీలవుతూ ఆడిటోరియం ముందు కారు దిగాను.

కానీ, అక్కడ హాజరైన సాహితీప్రియుల దగ్గర నుండీ ప్రముఖుల వరకూ అందరూ శశాంక చుట్టూ మూగి ఉన్నారు. నన్నెవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన నన్నొదిలి నిన్నగాక మొన్న వచ్చిన శశాంక ఆటోగ్రాఫుల కోసం ఎగబడే ఆ జనాల్ని చూసి పిచ్చికోపం వచ్చింది. నా ఆనందంలో పడి శశాంక విషయమేదీ పట్టించుకోలేదు.

అసలు విషయం ఆ తరువాత తెలిసింది. అంతకు ముందు రోజే అతనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

* * *

అతని స్టేటస్ మరింత పెరిగింది. నేను మాత్రం అవకాశం దొరికితే చాలు, అతన్ని బయటకు లాగాలనే చూసేవాడిని. ఏ చిన్న లొసుగు కూడా దొరకకుండా జాగ్రత్తపడేవాడతను.

తరువాత ఒక కథ రాశాను. అందులో హీరో ఒక రచయిత. అతను అసిస్టెంట్స్‌ని పెట్టుకుని, వారినుంచి ఫ్రెష్ ఐడియాలు రాబడుతున్నాడనే అభియోగాన్ని శశాంక మీద అన్యాపదేశంగా మోపాను. అతను రాయడనీ, ఘోస్ట్ రైటర్స్ చేత రాయిస్తాడనీ ప్రచారం చేశాను.

కానీ, ఆ అభియోగం కూడా అతని మార్కెట్ మీదగానీ, కెరీర్ మీదగానీ చిన్న మచ్చకూడా వేయలేకపోయింది. కొద్ది రోజులు నేను శశాంక విషయాల్లో తల దూర్చకుండా నా కెరీర్ గురించి ఆలోచించాలనుకున్నాను. రచయితగా నాకు సంతృప్తినివ్వని నవలలను రాయటం వల్ల నాకెటువంటి లాభమూ కలగదు. అప్పుడు పరిశీలించాను. శశాంక పాఠకుల నాడిని ఎలా పట్టుకోగలిగాడో అర్థమయ్యాక, నేను నా స్టయిల్ మార్చి మరొక నవల రాయాలనుకున్నాను.

> "జ్ఞానమేమీ లేనప్పుడు నేను గొప్ప జ్ఞానిని అనుకున్నాను. కొద్దిగా జ్ఞానమొచ్చాక నా అంత మూర్ఖుడెవడూ లేడని తెలుసుకున్నాను."

రెండు సంవత్సరాల వరకూ విషయ పరిశీలనలో ఉన్నాను. ఆ మధ్యకాలంలో నేను రాసింది ఒకే ఒక్క నవల. అది రాయడానికి కొన్ని వందల పుస్తకాలు రిఫర్ చేయాల్సి వచ్చింది. కొన్ని తెగల జీవితాల్ని పరిశీలించవలసి వచ్చింది. నా ఆశయం ఒక్కటే.

అది - శశాంకని అధిగమించే ఒకే ఒక్క నవల రాయాలని.

ఆది పూర్తయ్యాక తిరిగి వచ్చి, పబ్లిషింగ్ కిచ్చిన తరువాత నా జీవితంలో అంత టెన్షన్ ఎప్పుడూ అనుభవించలేదు. నష్టం కూడా ఆలోచించకుండా తక్కువ ధర మీద డిస్ట్రిబ్యూటర్స్‌తో అమ్మించాను.

అంతే, మొదటి కాపీలు విపరీతంగా అమ్ముడవటం ప్రారంభమైంది. చూస్తుండగానే సెకండ్, థర్డ్ ఎడిషన్స్ కూడా జరిగిపోయాయి.

సరిగ్గా అప్పుడే..... నేనే కాదు, ఎవరూ ఊహించని విధంగా నా నవలకి జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించబడింది. శశాంకని అధిగమించే గెలుపు. నేనిప్పుడు నంబర్ వన్ రైటర్ని

నా పుస్తకాల సర్క్యులేషన్ రెట్టింపు అయింది. జ్ఞానపీఠ్ అవార్డు వచ్చిన నా పుస్తకాన్ని సోమసుందరన్ డైరెక్షన్‌లో సినిమా తీయడానికి అయిదు లక్షలు ఇచ్చి నిర్మాతలు కొనుక్కున్నారు.

నేను అమెరికా యాత్ర చేసి వచ్చాను. ఎక్కడికి వెళ్ళినా సన్మాన సభలూ, ఆటోగ్రాఫులూ.

పబ్లిషర్స్ దగ్గర నా రాయల్టీ పెంచేసేను. ఎడిటర్స్ నా చుట్టూ తిరుగుతున్నారు.

నా ధ్యేయంలో పడి శశాంక ఏం రాస్తున్నాడో, ఏం చేస్తున్నాడో కూడా పట్టించుకోలేదు. ఇకనుంచీ ఏం రాసినా కూడా అవన్నీ నా రచనల తరువాతే. అదిమాత్రం తథ్యం. ఎడిటర్లయినా, డైరెక్టర్లయినా నా రచనలకే మొదటి ప్రిఫరెన్స్ ఇస్తారని తెలుసు. అదే నేను కోరుకున్నది కూడా.

ఇంత విజయం సాధించాక, నేను శశాంక దగ్గరికి బయలుదేరాను. నాకు జ్ఞానపీఠ్ అవార్డు వచ్చిందన్న విషయం అతనికెప్పుడో తెలిసి ఉండొచ్చు. కానీ, నా నోటితో చెప్పి అతడి కళ్ళలో ఈర్ష్య చూడాలని నా ఆశ.

నేనతని ఇంటికి వెళ్ళేసరికి అతనా ఇంట్లో లేడు. అది అమ్మేసి ఊరి చివరి తోటలో ఉంటున్నాడని తెలిసింది. ఆశ్చర్యపోయాను. అంతర్లీనంగా ఆనందపడ్డాను కూడా. గెలుపంటూ రావాలనే గానీ, దాన్ని పెనవేసుకుని మిగతా అదృష్టం కూడా కలిసి వస్తుంది అనుకున్నాను.

- వెంటనే అతన్ని కలుసుకోవడానికి బయలుదేరాను. దాదాపు సిటీ లిమిట్స్‌లో ఉందా తోట. చిన్నదే అయినా అందంగా ఉంది.

కారు దిగి, గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టాను. అక్కడి వాతావరణం ఒక ఆశ్రమ వాటికలా ఉంది. బాట కిరుపక్కలా పూల చెట్లతో నిండి ఉంది. బాట కెదురుగా ఒక చిన్న కుటీరం. కాస్త దూరంలో ఎడమ పక్క చిన్న పాఠశాల. దాని ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు. మరోవేపు వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన స్కూల్ ఉంది.

నేను కుటీరం దగ్గరికి వెళ్ళేసరికి - అక్కడ చిన్న వరండాలో పద్మాసనం వేసుకుని భగవద్గీత చదువుతున్న శశాంక కనిపించాడు.

అలికిడికి తలెత్తి, నన్ను చూడగానే భగవద్గీతకు సమస్కరించి, "రండి"అన్నాడు. నేను ముందుకు నడిచి అతను చూపించిన ఛత్రంజి మీద కూర్చున్నాను. అతను కూడా నా ఎదురుగా కూర్చుంటూ, "అవార్డు వచ్చినట్టు పేపర్లో చదివాను. అభినందనలు" అన్నాడు.

"కానీ, నువ్వేమిటిదంతా?" అయోమయంగా అడిగాను. అతను నవ్వి ఊరుకున్నాడు. "అంత ఆస్తి ఏం చేశావ్?"

"ఓల్డ్‌మెన్ ట్రస్ట్‌కి విరాళంగా ఇచ్చాను." అతనదే చిరునవ్వుతో చెప్పాడు.

"ఏమిటి?" విస్తుబోయాను. - "అలా అయితే నువ్వు బతికేదెలా?"అన్నాను.

"మనిషి బతకడానికి ఆ మేడలూ, కార్లూ......ఆ హోదా అవేవీ అక్కర్లేదని తెలుసుకున్నాను. నా కోసం ఈమాత్రం చాలనిపించింది. ఇక్కడ నేను కడుపు నిండా తినగలుగుతున్నాను. మిగిలింది మరికొందరికి పెట్టగలుగుతున్నాను. ఇందులో నాకు చాలా సంతృప్తి దొరుకుతుంది."

ఒక గాఢమైన నిట్టూర్పు వదిలాను. తిరిగి అతనే అన్నాడు;

"అక్కడ మన రంగంలో నాకెప్పుడూ అసంతృప్తిగానే ఉండేది. ఒక్కోసారి మన స్థానాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆత్మాభిమానం కూడా చంపుకోవాలి. రచయితగా ఎంతో సాధించినా, ఒక మనిషిగా వ్యక్తిత్వాన్ని చంపుకో లేననిపించింది. అందుకే ఎంతో సంఘర్షణ అనుభవించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చాను."

"మరయితే ఇక రచనా రంగం నుంచి నిష్క్రమించినట్లేనా?"

"పూర్తిగా. ఇక నేనేమీ రాయలేను. అసలు నేనేమీ చదవలేదు. ముందుగా ఈ ప్రపంచాన్ని చదవాలనుకుంటున్నాను. ఈ రాగద్వేషాల మూలం శోధించాలనుకుంటున్నాను. దీనికి మీరు వైరాగ్యమనో, వేదాంతమనో......ఏ పేరు పెట్టుకున్నా నాకభ్యంతరం లేదు. ముందుగా నాలో ఉన్న 'నేను' అనే భావం గురించి తెలుసుకోవాలి. అంతే!"

ఆ తరవాత నేను బయటకు వచ్చాను. కారులో వస్తుంటే ఒక వాక్యం గుర్తొచ్చింది. అతడు రాసిందే.

"జ్ఞానమేమీ లేనప్పుడు నేను గొప్ప జ్ఞానిని అనుకున్నాను. కొద్దిగా జ్ఞానమొచ్చాక నా అంత మూర్ఖుడెవడూ లేడని తెలుసుకున్నాను."

నేను సాంఘికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనుకున్నాను కానీ, ఎదుగుదల అనేది ఒక వృత్తం లాంటిదనీ, అది మళ్ళీ కిందికి వచ్చి బయలుదేరిన చోటే ఉంచుతుందని, అదే పరిపూర్ణమయిన వేదాంతమనీ.....అతను తెలుసుకున్నంత తొందరగా నేను తెలుసుకోలేకపోయాను.

ఎప్పుడూ నా కన్నా అతనొక అడుగు ముందే ఉన్నాడు. నా కన్నా వెనుక ప్రారంభించాడు. నన్ను దాటి వెళ్ళాడు. నాకన్నా తొందరగా 'మానసికంగా' ఎదిగాడు. బహుశా నేను వేదాంతిగా మారొచ్చు.

కానీ, అందులో కూడా అతను నా కన్నా ఒక్క అడుగు ముందే ఉన్నాడు. ■